క్లుప్తంగా

ఓపెన్ స్కూళ్లను వినియోగించుకోవాలి

దామెర : ఓపెన్ స్కూల్ కేంద్రాలను వినియోగించుకోవాలని ఎంఈఓ లకావత్ రాజేష్ కుమార్ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి వరకు చదవకుండా మధ్యలోనే మానేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలని సూచించారు. మండలంలో 150 నుంచి 200 మంది వరకు ఉన్నారని, ఊరుగొండ, ప్రభుత్వ పాఠశాలల్లో చేరాలని సూచించారు. అడ్మిషన్ల కోసం ఎమ్మార్సీ కార్యాలయంలో, ఊరుగొండ, పసరగొండ పాఠశాలలను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఒకరికి జైలు

శాయంపేట : మండలంలోని హుస్సేన్‌పల్లి గ్రామానికి చెందిన కొలె మధుకర్ డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడడంతో పరకాల కోర్టు ఒక రోజు జైలు శిక్షతో పాటు రూ. 1,000 జరిమానా విధించినట్లు ఎస్సై జక్కుల పరమేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. హుస్సేన్‌పల్లి గ్రామానికి చెందిన కొలె మధుకర్ జూన్ 29న డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. దీంతో శుక్రవారం కోర్టు కానిస్టేబుల్ రతీష్ మధుకర్‌ను పరకాల సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. దీంతో ఒక రోజు జైలు శిక్షతో పాటు రూ. 1,000 జరిమానా విధించింది. మరో నలుగురి వ్యక్తులకు రూ.3,100 జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

వేలేరు : మండలంలోని పీచర సబ్ స్టేషన్ పరిధిలోని మద్దెలగూడెం ఫీడర్, బొతుగుట్ట ఫీడర్‌లో 132 కేవీ సబ్‌స్టేషన్‌కు సంబంధించిన టవర్లకు తీగలు అమర్చుతున్న కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ కుమారస్వామి తెలిపారు. ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఏర్పడనుందని పేర్కొన్నారు.

మొక్కల పంపిణీ

శాయంపేట : వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం శాయంపేట మండల కేంద్రంలో గ్రామస్తులకు పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్ మొక్కలను పంపిణీ చేశారు. వన మహోత్సవంలో భాగంగా ప్రతిఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైల్ రోకోను జయప్రదం చేయాలి

శాయంపేట : కేంద్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలనే డిమాండ్‌తో 17న జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న రైల్ రోకోను జయప్రదం చేయాలని జాగృతి యువత రాష్ట్ర నాయకుడు అమ్మ అశోక్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఏర్పాటు జాగృతి నాయకుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ జాగృతి, యూపీఎఫ్ ఒత్తిడితో అసెంబ్లీలో ప్రభుత్వం మూడు బీసీ బిల్లులు పెట్టిందని అన్నారు. రాజకీయ అవకాశాల్లో బీసీ మహిళల పరిస్థితి దారుణంగా ఉందని, మహిళా రిజర్వేషన్లలో బీసీలకు ఉప కోట ఉండాలన్నారు. ఈనెల 17న నిర్వహించే రైలు రోకో కార్యక్రమంలో జాగృతి నాయకులు పెద్దెత్తున పాల్గొనాలని అశోక్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాగృతి నాయకులు శివ, రేవంత్, వంశీ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

శాయంపేట : మండలంలోని గంగిరేణిగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాంశెట్టి లక్ష్మారెడ్డి మేనమామ రాములు ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి శుక్రవారం రాములు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట నాయకులు నందం, మోహన్, వెంకటేశ్వర్లు, కరణ్‌బాబు, రమేశ్, సురేష్, పరమేశ్వర్, కొమురయ్య, భాస్కర్, రమేష్, మొగిలి, అశోక్, శ్రావణ్ కుమార్ ఉన్నారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



ధర్మసాగర్ : మండలంలోని పెద్దపెండ్యాల గ్రామ మాజీ సర్పంచ్ తోట స్రవంతి అనారోగ్యంతో మృతిచెందారు. కాగా శుక్రవారం ఆమె అంత్యక్రియలు జరుగగా స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరై పాడె మోసారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

దామెర: ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక, మొరం, మట్టి తరలిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఎస్సై అశోక్ హెచ్చరించారు. కమలాపూర్ మండలం నుంచి దామెర మండలంలోని కోగిల్వాయి గుండా హనుమకొండకు రెండు ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా ల్యాదెళ్ల వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. అనంతరం విచారణ చేపట్టి ట్రాక్టర్ యజమానులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

జీపీ భవనం పూర్తయ్యేదెప్పుడో..?



నిలిచిపోయిన నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులు



సర్వాపురం పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రామపంచాయతీ భవనం

- 2023లో ప్రారంభించిన పనులు
- నిధుల లేమితో నిలిచిన వైనం
- పాఠశాలలో తాత్కాలికంగా కొనసాగిస్తున్న పనులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

నడికూడ : తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం 500పైగా జనాభా ఉన్న తండాలను అప్పటి రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసింది. అందులో భాగంగా మండలంలోని కొకొండ శివారు గ్రామంగా కొనసాగిన సర్వాపురం ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు అయ్యింది. చిన్న గ్రామం అవడంతో అద్దె భవనాలు లభించకపోవడంతో తాత్కాలికంగా గ్రామంలోని ప్రాథమిక పాఠశాల భవనంలో పంచాయతీ కార్యాలయం ఏర్పాటు చేశారు. అంతకుముందే అందులో అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతుండడంతో రెండు గదుల పాఠశాల కాస్త ఒకే గదికి కుదించారు. దీంతో పాఠశాల, గ్రామపంచాయతీ పక్కపక్కన ఉండడంతో ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఇలా ఉండడంతో పాఠశాలకు తమ పిల్లలను పంపించేందుకు తల్లిదండ్రులు విముఖత చూపిస్తున్నారని ఉపాధ్యాయులు వాపోతున్నారు. గ్రామ పంచాయతీ విధులు నిర్వహించడం కూడా కష్టమవుతుందని సిబ్బంది అంటున్నారు. 2023లో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి రూ.20 లక్షల అంచనా వ్యయంతో నూతన గ్రామపంచాయతీ భవనం మంజూరు చేసి, భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. ఇంతలో స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి చొరవచూపి నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులు పూర్తిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- సైకియాట్రిస్ట్ డాక్టర్ ప్రహసిత్

కమలాపూర్ : విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సైకియాట్రిస్ట్ డాక్టర్ ప్రహసిత్ సూచించారు. మండల కేంద్రంలోని ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు, యువత డ్రగ్స్, గంజాయి, బీడీ, సిగరేట్, మాదకద్రవ్యాలు వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. వ్యసనాలకు బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. వ్యసనాలకు బానిసైనవారు వాటి నుంచి విముక్తి పొందేందుకు టెలిమానస్ 14416 నంబర్‌కు కాల్ చేసి సమస్య పరిష్కరించుకోవచ్చన్నారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు, హ్యాండ్‌వాష్, డ్రై డే, డీ వాటరింగ్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవీందర్, హెచ్‌ఈఓ రవీందర్, సోషల్ వర్కర్ నరేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రహసిత్

'సైనిక్‌స్కూల్ నిర్మాణ పనులు ప్రారంభించాలి'

ధర్మసాగర్ : మండలంలోని ఎల్కుర్తి గ్రామ శివారులో గల సైనిక్ స్కూల్ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాషబోయిన సంతోష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏఐఎస్ఎఫ్ మండల మూడో మహాసభ జరిగింది. ఆయన పాల్గొని మాట్లాడుతూ.. గతంలో ఎల్కుర్తి శివారులో సర్వే నంబర్ 160 భూమిలో సైనిక్ స్కూల్ నిర్మాణానికి ప్రతిపాదిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రపోజల్ ఇచ్చి 50 ఎకరాల భూమిని రెవెన్యూ శాఖ సర్వే చేపట్టి క్లియరెన్స్ ఇచ్చినట్లు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ఏలుకుర్తి శివార్లో ఏర్పాటు చేయాల్సిన సైనిక్ స్కూల్‌ను సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోకి తరలిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయని తెలిపారు. ఈ తరుణంలో ప్రస్తుత ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి చొరవ తీసుకుని ధర్మసాగర్ మండలంలోని ఎల్కుర్తి శివారులో సైనిక్ స్కూల్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యే విధంగా చూడాలని, లేని పక్షంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు హేమంత్, కార్యదర్శి వినయ్, నాయకులు రితీష్, ఈశ్వర్, సాత్విక్, సంతోష్, నంద తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంతోష్

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి

- ఎంపీడీఓ గుండె బాబు

కమలాపూర్ : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ గుండె బాబు సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో పంచాయతీ క్యాదర్శులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లతో శుక్రవారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని, ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులు, వాటి నివారణ చర్యలపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూనే తమ ఇంటి పరిసరాల్లో మురుగు, వర్షపు నీరు నిలువకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. బ్లీచింగ్ పౌడర్, దోమల నివారణ మందు అందుబాటులో ఉంచుకోవాలని, మురుగు నీటి నిల్వలపై బ్లీచింగ్ పౌడర్, దోమల నివారణ మందు చల్లాలని, దోమలు వ్యాప్తి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయాలని సూచించారు. కలుషిత నీరు, గాలి, ఆహారం ద్వారా వచ్చే వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ చేతన్‌రెడ్డి, డాక్టర్ పద్మలత, పల్లె దవాఖాన వైద్యులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుండె బాబు

రోశయ్య సేవలు చిరస్మరణీయం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య అందించిన సేవలు చిరస్మరణీయమని ఆర్యవైశ్య సంఘం, కాంగ్రెస్ నాయకులు, వివిధ శాఖల అధికారులు కొనియాడారు. గురువారం ఆయన 92వ జయంతిని కమలాపూర్, దామెర, పరకాల, వేలేరు, శాయంపేటతో పాటు తదితర మండలాల్లో ఘనంగా నిర్వహించారు. రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్



కమలాపూర్ : దివంగత మాజీ ముఖ్యమంత్రి రోశయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్, ఆర్యవైశ్య సంఘం నాయకులు



దామెర : మాజీ సీఎం రోశయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు



వేలేరు : ఎంపీడీఓ కార్యాలయంలో రోశయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న అధికారులు

హైదరాబాద్‌కు తరలిన కాంగ్రెస్ నాయకులు

ఎల్కతుర్తి : రాజ్యాంగ పరిరక్షణ కోసం జాతీయ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన జైబాపు జైభీమ్ జైసంవిధాన్ టీపీసీసీ ఆధ్వర్యంలో జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సందేశాన్ని ప్రజల్లో మమేకమయ్యే విధంగా హైదరాబాద్‌లోని లాల్ బహదూర్ స్టేడియంలో నిర్వహించిన సభకు మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం తరలివెళ్లారు. ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలలా నుంచి ఆ పార్టీ శ్రేణులు ప్రైవేటు వాహనాల్లో వెళ్లారు. పార్టీ మండల అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, అయిలయ్య, నాయకులు సంతాజీ, రాజేశ్వర్‌రావు, అనీల్‌కుమార్, వెంకటేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు వెళ్లినవారిలో ఉన్నారు.

దామెర : హైదరాబాద్‌లో నిర్వహించిన కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుల సమ్మేళనానికి మండలంలోని కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం తరలివెళ్లారు. పార్టీ మండల అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి భిక్షపతి, నాయకులు ప్రవీణ్, రాధాకృష్ణ, లింగయ్య, విజేందర్, సుధాకర్, కిరణ్, రమేశ్, నర్సయ్య ఉన్నారు.

ఆత్మకూరు : హైదరాబాదులోని ఎల్బీ స్టేడియంలో శుక్రవారం జరిగిన మల్లికార్జున ఖర్గే బహిరంగ సభకు మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు.

మహిళలు అక్షరాస్యులుగా ఎదగాలి

ఐనవోలు : మహిళలు అక్షరాస్యులు కావాలని ఎంపీడీఓ నర్మద ఆకాంక్షించారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వీఓఏ, ఉపాధ్యాయులు, నిరక్ష్యరాసులైన వయోజనులతో ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా శిక్షణా నిర్వహించారు. ఆమె హాజరై ఎంపీడీఓ నర్మద మాట్లాడుతూ.. మహిళ చదువుకుంటేనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. వయోజనులు అందరూ అక్షరాస్యులై సమాజంలోని నిరక్షరాస్యతను నిర్మూలించాలని సూచించారు. గ్రామంలో గుర్తించిన నిరక్ష్యరాస్యులైన వయోజనుల వివరాలను ఉల్లాస్ యాప్‌లో ఏ విధంగా నమోదు చేయాలో రిసోర్స్ పర్సన్ రూపావతి, అనూష, వీఓఏ, ఉపాధ్యాయులకు వివరించారు. ఎంఈఓ పులి ఆనందం, స్థానిక హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఏపీఎం శ్రీనివాస్, సీఆర్‌పీ రాజ్‌కుమార్, భవన్‌కుమార్, రేవతి పాల్గొన్నారు.

ప్రజలను పెద్దమ్మతల్లి చల్లగా చూడాలి



శాయంపేట : ప్రజలను పెద్దమ్మతల్లి చల్లగా చూడాలని మత్స్య పారిశ్రామిక సంఘం కార్యదర్శి మోరే సురేష్ వేడుకున్నారు. శుక్రవారం మండలంలోని ప్రగతి సింగారం గ్రామంలో ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. మహిళలు డప్పు చప్పుళ్లతో కోలాహలంగా బోనాలతో పెద్దమ్మతల్లి ఆలయానికి చేరుకుని బోనాలు సమర్పించారు. అనంతరం మత్స్య పారిశ్రామిక సంఘం కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ.. గ్రామంలో ముదిరాజ్ కులస్తుల కుల దైవమైన పెద్దమ్మతల్లి బోనాల పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకున్నట్లు చెప్పారు. ముదిరాజ్ సంఘం సభ్యులు శ్రీను, కుమార్, వేణు, నాగరాజు, రవి, రమేశ్, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

అష్టాక్షరికి తరలివెళ్లిన భజన మండలి

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన శ్రీరామదాసు భజన మండలి సభ్యులు శుక్రవారం యాదగిరిగుట్ట సమీపంలోని కల్యాణ కట్ట డెర్మటీహాల్‌లో శనివారం నిర్వహించనున్న స్వాతి నక్షత్ర అష్టాక్షరి హరి భజన కార్యక్రమానికి తరలివెళ్లారు. గ్రామంలోని సంజీవ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తులసి, మారేడు మాలలతో యాదాద్రికి తరలివెళ్లినట్లు శ్రీరామదాసు భజన మండలి జిల్లా అధ్యక్షుడు మాందాడి రాజు, మండల శాఖ కార్యదర్శి తడుక సదానందం తెలిపారు. యాదగిరిగుట్టకు తరలివెళ్లిన వారిలో జాన్సి, లలిత, ఉమాదేవి, హరిత, సులోచన తదితరులు ఉన్నారు.



యాదాద్రికి తరలివెళ్తున్న భజన మండలి సభ్యులు

పేర్లు పింక్‌బుక్‌లో రాస్తున్నాం

- ఆరు నెలల్లో స్టేషన్ ఘన్‌పూర్‌లో ఉపఎన్నిక తథ్యం
- మాజీ ఎమ్మెల్యే 'తాడికొండ' జోస్యం

వేలేరు : స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తున్న అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకుల పేర్లను పింక్ బుక్‌లో రాస్తున్నామని, బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే వడ్డీతో సహా చెల్లిస్తామని మాజీ ఎమ్మెల్యే తాడికొండ రాజయ్య వాఖ్యానించారు. శుక్రవారం మండలంలోని షోడాషపల్లిలో గల జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి నివాసంలో ముఖ్య కార్యకర్తలతో కలిసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు అడిగే అర్హత ఎమ్మెల్యే కడియం శ్రీహరికి లేదని అన్నారు. ఆయన గెలిచిన నాటి నుంచి నేటి వరకు మండలానికి చేసిందేంలేదని ఆరోపించారు. ఆరు నెలల్లో స్టేషన్ ఘన్‌పూర్‌లో ఉప ఎన్నిక వస్తుందని జోస్యం చెప్పారు. మండలానికి చెందిన కొంతమందికి నేను పదవులు ఇస్తే వారు మోసం చేసి కడియం వెంట వెళ్లారని, భవిష్యత్‌లో వారిని రాజకీయంగా ఓడిస్తామని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు గుర్రాలకే అవకాశం ఇస్తామని, అన్ని గ్రామాల అభ్యర్థుల గెలుపు కోసం స్వయంగా వచ్చి ప్రచారం చేస్తానన్నారు. కార్యకర్తలు మాట్లాడుతూ.. తమకు పార్టీ కార్యక్రమ వివరాలు మండల పార్టీ బాధ్యులు సమాచారం ఇవ్వడం లేదని తెలుపగా.. అందరినీ కలుపుకుని వెళ్లాలని రాజ్యయ సూచించారు. మండల ఇన్‌చార్జ్ భూపతిరాజు, మాజీ జెడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపీపీ సంపత్, మండల కోఆర్డీనేటర్ సురేష్, మాజీ మండల అధ్యక్షుడు నర్సింగరావు, నాయకులు మాధవరెడ్డి, మహేందర్, చిలుక రాజు, సంపత్, తిరుపతి పాల్గొన్నారు.



ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రాజయ్య

రైతు సంక్షేమాన్ని మరిచిన ప్రభుత్వం

- సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు

ఎల్కతుర్తి : రైతుల సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరిచిందని, పంటల బీమా అమలు చేయడంలో విఫలమైందని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉట్కూరి రాములు విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభమై నెలరోజులు గడుస్తున్నా పంటల బీమా పథకాన్ని అమలు చేయలేదన్నారు. గత బడ్జెట్‌లో రూ.1.300కోట్లు కేటాయించినప్పటికీ ఈ సీజన్‌లో ఇంకా పంటల బీమా అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా పంటల బీమా పథకాన్ని అమలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈనెల 9న హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు అశోక్ రావు, మండల కార్యదర్శి మనోహర్‌రావు, మొండయ్య, సంజీవ్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాములు

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి

- హనుమకొండ డీఐఈఓ గోపాల్

శాయంపేట : విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని హనుమకొండ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి (డీఐఈఓ) గోపాల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కందగట్ల కోటేష్ అధ్యక్షతన నిర్వహించిన యాంటీ డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు చెడు స్నేహాలకు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, అప్పుడే జీవితంలో గొప్ప విజయం సాధిస్తారని సూచించారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెడితే భవిష్యత్ బాగుంటుందని అన్నారు. అనంతరం యాంటీ డ్రగ్స్‌కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



యాంటీ డ్రగ్స్ వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఐఈఓ, అధ్యాపకులు

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న డాక్టర్ స్వాతి

ఆత్మకూరు : మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని మండల వైద్యాధికారిని స్వాతి అన్నారు. మండల కేంద్రంలో సర్వోదయ సంస్థ ఆధ్వర్యంలో మహిళా చట్టాలు, సహాయ వ్యవస్థలపై శుక్రవారం మహిళా సహాయత కమిటీ సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలకు ఉన్న హక్కులు, చట్టాలపై ప్రతీ మహిళా అవగాహన కలిగి ఉండాలన్నారు. కుటుంబ పనుల్లో అధిక సమయం కేటాయిస్తూ ఆరోగ్యంపై మహిళలు శ్రద్ధ వహించడం లేదని అన్నారు. మహిళలు చిరుధాన్యాలతో చేసిన పిండి వంటలు తినాలని, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్వోదయ సంస్థ ఫీల్డ్ కోఆర్డినేటర్ రవీందర్, సీపీ ఉమ, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలి

- ఆర్డీఓ నారాయణ

ఆత్మకూరు : ఓటరు నమోదుపై బీఎల్‌ఓలు ప్రజలకు అవగాహన కల్పించాలని ఆర్డీఓ నారాయణ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో శుక్రవారం ఆత్మకూరు, దామెర మండలాల బీఎల్‌ఓలకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. ఓటర్ల తొలగింపు విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఓటర్ నమోదు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని ప్రజలకు తెలియజేయాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునే విధంగా కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ జగన్‌మోహన్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ సూర్యప్రకాశ్, సీనియర్ అసిస్టెంట్ భద్రయ్య, ఆత్మకూరు, దామెర మండలాల డిప్యూటీ తహసీల్దార్లు భాస్కరమూర్తి, యూసుఫ్ ఖురీషి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ నారాయణ

సీఐ రంజిత్‌రావుకు మెడల్

శాయంపేట : వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న భద్రాద్రి జోనల్ పోలీస్ డ్యూటీ మీట్ శుక్రవారంతో ముగిసింది. ఈ డ్యూటీ మీట్‌లో శాయంపేట సీఐ రంజిత్‌రావు నేర పరిశీలన విభాగంలో ఫింగర్ ప్రింట్స్ లిఫ్టింగ్ అండ్ ప్యాకింగ్, మెడికో లీగల్ టెస్ట్‌లో అత్యంత ప్రతిభ కనబరిచినందుకు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ స్విలర్ మెడల్స్ అందించారు. ఎస్సై జక్కుల పరమేష్, సిబ్బంది సీఐ రంజిత్‌రావు ను అభినందనలు తెలిపారు.



మెడల్ అందుకున్న సీఐ రంజిత్‌రావు